'నీట్‌లో పొరపాట్లకు తావివ్వద్దు'

సూర్యాపేట, ఏప్రిల్ 29: జిల్లాలో జరుగనున్న నీట్ ప్రవేశ పరీక్షలో ఎలాంటి పొరపాట్లకూ తావు లేకుండా చూడాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణపై ఎస్పీ నరసింహతో కలిసి జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 4న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నీట్ పరీక్ష జరుగుతుందని, అందుకు గానూ జిల్లా కేంద్రంలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు అడ్మిట్ కార్డుతో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ పార్థసారథి, డీఈఓ అశోక్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎడ్ల బండ్ల యాత్ర చేపట్టిన రైతులకు సన్మానం

ఆత్మకూర్.ఎస్ గ్రామంలో రైతులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 29: బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా ఎడ్ల బండ్ల యాత్ర చేపట్టిన మండల పరిధిలోని రామోజీతండా, నశింపేట, ఆత్మకూర్.ఎస్ గ్రామాలకు చెందిన రైతులను జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తూడి నర్సింహారావు, ముద్దం కృష్ణారెడ్డి, కసగాని బ్రహ్మంగౌడ్, బత్తుల ప్రసాద్, మాజీ సర్పంచ్ గోపగాని మల్లయ్య, రైతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి'

కోదాడ రూరల్, ఏప్రిల్ 29: పాడి రైతులు ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యుడు యశ్వంత్‌రామ్ అన్నారు. మండల పరిధిలోని గణపవరం గ్రామంలో సంగం డెయిరీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 150 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కె.నాగప్రభు, వి.వరప్రసాద్‌రావు, రమేశ్, రామకృష్ణ, రాధాకృష్ణమూర్తి, ప్రదీప్, ఉమామహేశ్వరరావు, పాడి రైతులు పాల్గొన్నారు.

'ధాన్యంలో తేమ తక్కువగా ఉండేలా చూసుకోవాలి'

నూతనకల్, ఏప్రిల్ 29: రైతులు ధాన్యంలో తేమ శాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రపహాడ్, దిర్శనపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం కాంటాలు త్వరగా పూర్తి చేసి మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ హస్సాన్ తదితరులు పాల్గొన్నారు.

గేదెను ఢీకొట్టిన బైక్.. వ్యక్తికి తీవ్ర గాయాలు

నేరేడుచర్ల, ఏప్రిల్ 29: గేదెను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని రామగిరి వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి పవర్ ప్లాంట్‌లో డీఈగా పని చేస్తున్న ధరావత్ రమేశ్ ఖమ్మం వెళ్లి తిరిగి వస్తుండగా రామగిరి వద్ద అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చిన గేదెను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో తొలుత ఆయనను 108 అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మిర్యాలగూడలోని అపోలో ఆసుపత్రికి తరలించారు.

బస్సు ఢీకొని మూడు పాడి గేదెలు మృతి

నేరేడుచర్ల, ఏప్రిల్ 29: ప్రైవేట్ బస్సు ఢీకొని మూడు పాడి గేదెలు మృతిచెందిన ఘటన మండలంలోని చిల్లేపల్లి గ్రామ శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ రవీందర్ వివరాల ప్రకారం.. భద్రాద్రి జిల్లా కొత్తగూడెం నుంచి బెంగళూరు వెళ్తున్న శ్రీ తులసి ట్రావెల్స్ బస్సు చిల్లేపల్లి గ్రామ శివారులో నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడెంకు చెందిన మన్నెం వెంకన్నకు సంబంధించిన మూడు పాడి గేదెలను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఖబ్రస్తాన్‌లో బయటపడిన రాగి శాసనాలు

రాగి శాసనాలను చూపుతున్న అధికారులు

కోదాడ టౌన్, ఏప్రిల్ 29: కోదాడలోని పాత ఖబ్రస్తాన్‌లో పురాతన రాగి శాసనాలు బయటపడ్డాయి. కోదాడ డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆర్డీఓ సూర్యనారాయణ, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఖబ్రస్తాన్‌లో మంగళవారం ఓ వ్యక్తి గుంత తవ్వుతుండగా పలు భాషల్లో ఉన్న రాగి పలకలు లభ్యమయ్యాయి. వాటిపై శాసనాలు ఉన్నట్లు గుర్తించి వక్ఫ్ బోర్డు సభ్యులు సమాచారం ఇవ్వడంతో వాటిని స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. కలెక్టర్‌కు సమాచారం అందించామని, ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ వాజీద్ అలీ, పట్టణ సీఐ శివశంకర్‌నాయక్, ఎస్ఐ రంజిత్‌రెడ్డి, ఆర్ఐ రాజేశ్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల మేలు కోసమే భూ భారతి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

చివ్వెంల: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

చివ్వెంల/మోతె, ఏప్రిల్ 29: రైతుల మేలు కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. భూ భారతి చట్టంపై చివ్వెంలలోని వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో, మోతెలోని స్వస్తిక్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ భారతి చట్టంతో రైతుల సమస్యలన్నీ తీరిపోతాయని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెండంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుందని, తాసీల్దార్ వద్ద కాకుంటే ఆర్డీఓ స్థాయిలో అప్పీల్‌కు వెళ్లవచ్చని తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, రెవెన్యూ కమిటీల ద్వారా దరఖాస్తులు స్వీకరించి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ రాంబాబు, చివ్వెంల మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్‌రెడ్డి, తాసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ సంతోశ్‌కుమార్, ఏఓ వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ చింతమల్ల రమేశ్, మోతె తాసీల్దార్ శ్రీకాంత్, మండల ప్రత్యేకాధికారి సీతారాంనాయక్, ఎంపీడీఓ ఆంజనేయులు, జల సాధన కమిటీ ఫౌండర్ దుచ్చర్ల సత్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన కొనుగోళ్లు.. పేరుకుపోతున్న ధాన్యం రాశులు

● లారీలు రాక, బస్తాలు లేక ఇబ్బంది పడుతున్న రైతులు

తిరుమలగిరిలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

తిరుమలగిరి, ఏప్రిల్ 29: ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతన్నకు పంటను అమ్ముకునేందుకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పోసిన రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కొనుగోళ్లు జరుగక పడిగాపులు కాస్తున్నారు. పలుచోట్ల ధాన్యంలో తాలు, అధిక శాతం తేమ ఉందని కొర్రీలు పెడుతుండటంతో రైతులు వాపోతున్నారు. ఈ మధ్య అకాల వర్షాలకు ధాన్యం తడిచి రంగు మారి ఇప్పటికే రైతులు ఇబ్బంది పడుతుంటే దీనికి తోడు కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు లేకపోవడం మరో సమస్యగా మారింది.

కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా కొనుగోళ్లు సక్రమంగా జరుగడం లేదు. దీంతో రాత్రిపగలు అనే తేడా లేకుండా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంపై కప్పడానికి పట్టాలు అనుకూలంగా లేక ఇబ్బందులు పడుతుంటే మరోవైపు అప్పుడప్పుడు వాతావరణం రైతులను కంగారు పెడుతుంది. దీంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

లారీల కొరత

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి తూర్పార పట్టుకొని తేమ శాతం 17 వచ్చే విధంగా చూసుకున్నా సకాలంలో లారీలు రాక, బస్తాలు లేక ధాన్యం ఎగుమతులు జరుగడం లేదని రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు. అంతేకాకుండా కేటాయించిన మిల్లులకు ధాన్యం లారీల్లో పంపిస్తే దిగుమతులు ఆలస్యం అవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. దీనికితోడు కొనుగోలు కేంద్రాల్లో రైతులను దోపిడీ చేస్తున్నారు. లారీ ద్వారా బస్తాలు ఎగుమతి చేస్తే రెండు రూపాయలు, తాలు, తేమ సాకుతో బస్తాకు 1.2 కిలోలు తరుగు తీస్తున్నారు. కోఆపరేటివ్ సొసైటీ ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాంల వద్ద దిగుమతి చేస్తే బస్తాకి ఎనిమిది రూపాయలు కట్ చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. కనీస వసతులు కూడా కరువయ్యాయని చెబుతున్నారు. మండలంలో మొత్తం 20 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. చెప్పుకోవడానికే కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి తప్పా ధాన్యం కొనుగోళ్లు మాత్రం సక్రమంగా జరుగడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి కొనుగోళ్ల వేగం పెంచి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

'మేడే వేడుకలను జయప్రదం చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను

హుజూర్‌నగర్ రూరల్, ఏప్రిల్ 29: మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను పిలుపునిచ్చారు. హుజూర్‌నగర్ పట్టణంలో మంగళవారం నిర్వహించిన సీఐటీయూ రైస్‌మిల్ డ్రైవర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని అన్ని కేంద్రాల్లో పెద్ద ఎత్తున జెండాలు ఆవిష్కరించి, ర్యాలీలు, సభలు నిర్వహించి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో చింతకాయల మల్లయ్య, పర్వతాలు, చింతకాయల సైదులు, వీరబాబు, గోపాలు, జానకిరాముడు, కనకయ్య, శ్రీను, శ్రీహరి, అంజి, సైదులు, మల్లేశ్, రమేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి'

పాలకవీడు, ఏప్రిల్ 29: పాలకవీడు మండలంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఐ జిల్లా నాయకుడు ధనుంజయనాయుడు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సీపీఐ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన మండలంగా ఏర్పాటైన పాలకవీడులో సమస్యలు నెరవేరడం లేదని అన్నారు. మండలంలోని శూన్యపహాడ్ గ్రామంలో మూసీ నదిపై లోలెవల్ వంతెన స్థానంలో హై లెవల్ వంతెన ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చలనం లేదని విమర్శించారు. మండల కేంద్రంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, పాలకవీడు, గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాలను కలిపి పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మే 1న నేరేడుచర్ల, పాలకవీడు మండల మహాసభలను నేరేడుచర్ల మండలంలోని ఘంటావారిగూడెం గ్రామంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 29: మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరికి జైలు శిక్ష, మరికొంతమందికి జరిమానాలు విధించినట్లు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న నలుగురు పట్టుబడినట్లు తెలిపారు. వీరిలో ఒకరికి జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా, మిగతా ముగ్గురికి రూ.4 వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి.వి.రమణ తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు, జరిమానాలు తప్పవని ఎస్ఐ సాయిరాం హెచ్చరించారు.

భూ భారతి చట్టంపై నేడు అవగాహన

మేళ్లచెర్వు, ఏప్రిల్ 29: మండల కేంద్రంలోని కస్తూరి వెంకటేశ్వర కల్యాణ వేదికలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తాసీల్దార్ జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుల శిక్షణకు రిసోర్స్ పర్సన్‌గా జాఫర్

మేళ్లచెర్వు, ఏప్రిల్ 29: రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కోసం స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా మేళ్లచెర్వు మండలం కందిబండ జడ్పీహెచ్ఎస్ సైన్స్ ఉపాధ్యాయుడు షేక్ జాఫర్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనను ఎంఈఓ వెంకటరెడ్డి, హెచ్ఎం అనిల్‌కుమార్, ఉపాధ్యాయుడు నారపరెడ్డి తదితరులు అభినందించారు.

'చెస్ పోటీలను విజయవంతం చేయాలి'

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 29: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 4వ తేదీన నిర్వహించే ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి అండర్ 7,9,15 బాలబాలికల చెస్ పోటీలను విజయవంతం చేయాలని సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని సూచించారు. జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఎల్.సతీశ్‌కుమార్‌ను 93947 53343 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని వీడాలి

● సీఐ చరమందరాజు

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ చరమందరాజు

మఠంపల్లి, ఏప్రిల్ 29: రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని వీడి సన్మార్గంలో జీవించాలని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పలువురు రౌడీషీటర్లకు మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కుటుంబంలో ఒక వ్యక్తిపై రౌడీషీట్ నమోదైతే సమాజంలో ఆ కుటుంబం వివక్షకు గురవుతుందని పేర్కొన్నారు. నేరాలను మానుకొని సమాజ హితానికి పాటుపడాలని సూచించారు. మండలంలోని గ్రామాల్లో, తండాల్లో ప్రత్యేక పోలీస్ నిఘా ఉంటుందని, నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బాబు, ఏఎస్ఐ శంకర్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి'

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మోతె, ఏప్రిల్ 29: అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ మోతె మండల కేంద్రానికి విచ్చేసిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు సీపీఎం మోతె మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు మాట్లాడుతూ గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు తమకు నచ్చిన వారి పేర్లతో జాబితాలు పంపి అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ వారికే ఇండ్లను మంజూరు చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల మోతె మండలంలో అర్హత లేని వారికి ఇండ్లను మంజూరు చేశారని, ప్రభుత్వం తక్షణమే రీ సర్వే జరిపి అర్హత లేని వారిని తొలగించి అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి ములుకూరి గోపాల్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు నాగం మల్లయ్య, దోసపాటి శ్రీనివాస్, జంపాల స్వరాజ్యం, వెలుగు మధు, ఎడమ పద్మ పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి పవిత్రమైంది

● సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ

ల్యాంప్ లైటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థినులు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 29: సమాజంలో నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైందని, ఈ వృత్తిలోకి వచ్చే వారు ధైర్యంగా ఉండి అంకితభావంతో సేవ చేయాలని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని జే ఫంక్షన్ హాల్‌లో శ్రీలక్ష్మీ వెంకటసాయి నర్సింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు మంగళవారం నిర్వహించిన ల్యాంప్ లైటింగ్, ప్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రోగులకు అంకితమై సేవలు అందించిన ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను నర్సింగ్ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రిలో రోగులకు డాక్టర్లు చేసే వైద్యం ఎంత ముఖ్యమో నర్సులు చేసే సేవ కూడా అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ రేణుకబాయి, జనరల్ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ జనార్ధన్, కళాశాల కరస్పాండెంట్ కారింగుల బాలాగౌడ్, చైర్‌పర్సన్ కారింగుల విజయలక్ష్మి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న, ఒకేషనల్ ప్రిన్సిపాల్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

మాట్లాడుతున్న డాక్టర్ రవిప్రసాద్

తుంగతుర్తి, ఏప్రిల్ 29: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని తుంగతుర్తి పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ రవిప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 328 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. గాలికుంటు వ్యాధి పశువుల్లో పాల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించి పాడి రైతులకు ఆర్థిక నష్టాలన్ని కలిగిస్తుందని, కాబట్టి వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ నరేశ్, రాజశేఖర్, రవి, నాగరాజు, బుచ్చిబాబు, శ్రీనివాస్‌రెడ్డి, లింగయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పోషకాహార కిట్ల పంపిణీ



అనంతగిరి: పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యురాలు లక్ష్మీప్రసన్న

అనంతగిరి, ఏప్రిల్ 29: మండల పరిధిలోని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 10 మంది క్షయ బాధితులకు మంగళవారం పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ క్రమం తప్పకుండా మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకున్నట్లయితే క్షయ వ్యాధి నుంచి త్వరగా కోలుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నడిగూడెం పల్లె దవాఖానా డాక్టర్ హరినాథ్, సూపర్‌వైజర్ వెంకటనర్సమ్మ, టీబీ నోడల్ పర్సన్ కృష్ణమూర్తి, ల్యాబ్ టెక్నీషియన్ మహేశ్, ఫార్మసిస్ట్ శైలజ, ఏఎన్ఎంలు మంజుల, విజయకుమారి, రాధ, రమ, మంగ, జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్వపల్లి: మండలానికి చెందిన పలువురు క్షయ బాధితులకు అర్వపల్లి ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నగేశ్‌నాయక్, సీహెచ్ఓ మాలోతు బిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, కిరణ్, వీరయ్య, శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిరు పేదలకు బియ్యం పంపిణీ

నేరేడుచర్లలో నిరు పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న వాసవి, వనితా క్లబ్బుల బాధ్యులు

నేరేడుచర్ల, ఏప్రిల్ 29: వాసవి, వనితా క్లబ్బుల డిస్ట్రిక్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, పద్మ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక వాసవి, వనితా క్లబ్బుల ఆధ్వర్యంలో నేరేడుచర్లలో నిరుపేదలకు బియ్యం పంపిణీ చేశారు. అదేవిధంగా చలివేంద్రంలో మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, పీఆర్ఓ గరిణె అరుణకుమారి. ఆరోగ్య శిబిరాల ఇన్‌చార్జి రాచకొండ శ్రీనివాస్, వీరవెల్లి శ్రీలత, గెల్లి లక్ష్మీప్రసన్న, లక్ష్మీ నర్సింహారావు, వనితా క్లబ్ అధ్యక్షురాలు గరిణె జ్యోతి, కోశాధికారి చెరుకు కవిత, సభ్యులు పోలిశెట్టి సంధ్య, ఈగ భాగ్యశ్రీ, చెరుకు రాము, వాసు, సుధాకర్, నటరాజ్, గోపాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనం..పట్టని వైనం

- తిరుమలగిరి పట్టణ ప్రకృతి వనంలో నిర్వహణ లోపంతో ఎండుతున్న మొక్కలు
- పట్టించుకోని అధికారులు
- చర్యలు చేపట్టాలని ప్రజల విన్నపం

తిరుమలగిరి మున్సిపాలిటీలోని 5వ వార్డులో కళావిహీనంగా పట్టణ ప్రకృతి వనం

తిరుమలగిరి, ఏప్రిల్ 29: పట్టణాల్లో పచ్చదనం పెంచడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించడం లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. కానీ ప్రస్తుతం వాటి నిర్వహణ మాత్రం అధ్వానంగా తయారైంది. రూ.లక్షలు వెచ్చించి ఒక్కో పట్టణ ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేస్తే అధికారుల నిర్లక్ష్యంతో అధ్వానంగా మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పచ్చదనంతో కళకళలాడాల్సిన ప్రకృతి వనాల్లో గడ్డి పెరిగి కనిపిస్తుండడంతో లక్ష్యం నీరుగారుతోంది. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో 15 వార్డుల్లో 10 పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. వీటి రక్షణ కోసం చుట్టూ ఫెన్సింగ్, గేట్లు, బోర్లు వేసి మొక్కలను సంరక్షించేలా ఏర్పాట్లు చేశారు. కానీ ప్రస్తుతం వాటి నిర్వహణ లోపం వల్ల మొక్కలు ఎండుతూ అస్తవ్యస్తంగా మారాయి. వర్షాకాలంలో వివిధ రకాల మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించే చర్యల్లో అధికారులు విఫలం అవుతున్నారు.

పర్యవేక్షణ లోపం

తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో రూ.50 లక్షలు వెచ్చించి 10 పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కొన్ని చోట్ల గేట్లు విరిగాయి. వేసవి కాలం కావడంతో నీరు సక్రమంగా అందించకపోవడంతో మొక్కలు ఎండుతున్నాయి. మున్సిపాలిటీలోని 5వ వార్డు పట్టణ ప్రకృతి వనం సమీపంలో ఇటీవలి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో ప్రకృతి వనం సమీపంలోని మొక్కలు వేడికి వ